
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శనివారం 20 సెప్టెంబరు 2025



మురిపిస్తున్న మత్తళ్లు

కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. కోహెడ మండలం శనిగరం 1 టీఎంసీ డ్యామ్, చిన్నకోడూరు మండలంలోని మందపల్లి, మేడిపల్లి చెరువులు మత్తళ్లు దూకుతూ జలపాతాలను తలపిస్తున్నాయి. స్థానిక యువతీయువకులు చెరువులు, మత్తళ్ల వద్ద ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. శనిగరం ప్రాజెక్టు వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డు పెట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్యామ్‌లోపలికి వెళ్లి స్నానాలు చేయడం సెల్ఫీలు దిగడం చేస్తున్నారు. నీటిలోకి దిగితే ప్రాణాలకు ప్రమాదం లేకపోలేదు.

\- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్







నియోజకవర్గంలో హాట్‌టాపిక్

దుబ్బాక రాజఖాకీయం!

● ఇద్దరు పోలీసు అధికారుల కన్ను!

- స్వచ్ఛంద సంస్థ పేరిట జనంలోకి..
- ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం వినూత్న ప్రయత్నాలు
- పునర్విభజనలో మార్పు ఉండొచ్చని పలువురి కన్ను
- రిజర్వేషన్‌పై ఉత్కంఠ

పోలీసుల ఉక్కుపాదం చూసిన గడ్డ దుబ్బాక.. ఈ గడ్డపై ఇద్దరు నాయకులు రాజకీయంగా నిలబడటానికి ఆ పోలీసులనే టార్గెట్ చేసుకున్నారు..వారి వ్యూహాలే తర్వాత విజయాలు అందించాయి. ఆనాడు రామలింగారెడ్డి.. ఆ తర్వాత రఘునందన్‌రావుది అదే నేపథ్యం. పోలీసులకు వ్యతిరేకంగా నిలబడిన నాయకుడిని ఆదరించే దుబ్బాకపై ఇప్పుడు ఇదే పోలీసు అధికారులు ప్రయత్నించడం చర్చకు దారితీసింది.. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలోకి వెళ్లేందుకు ఇద్దరు పోలీస్ అధికారులు ముందుకెళ్లడం దుబ్బాక నియోజకవర్గం లో హాట్‌టాపిక్‌గా మారింది. రాజకీయ వర్గాలను కూడా కుదిపేసి, చర్చకు, ఆలోచనకు దారితీస్తుంది. వీరి ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో వేచిచూడాలి.

- సిద్దిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



దుబ్బాక మండం పెద్దచీకోడు గ్రామానికి చెందిన తౌడ సత్యనారాయణ ప్రస్తుతం కూకట్‌పల్లి ఎస్‌ఐగా పని చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కీలకంగా పనిచేస్తూ 1995 నుంచి 2004 వరకు స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. అదే సమయంలో దుబ్బాక ఎస్‌ఐగా పని చేసి వివిధ ఎన్‌కౌంటర్ల ద్వారా ప్రమోషన్ పొందిన మధుకర్ స్వామి ప్రస్తుతం మేడ్చల్ డీసీపీగా, పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉన్నారు. వీరిద్దరు కొంత కాలంగా దుబ్బాక మండలంలోని వివిధ కార్యక్రమాలతో అఖిలరాజ్ ఫౌండేషన్‌ను స్థాపించి, సేవాకార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు. ఒక్కసారిగా వీరిద్దరు దుబ్బాక ప్రాంతాన్ని ఎంచుకుని సేవాకార్యక్రమాలను చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

పోలీసులకు వ్యతిరేకంగా..

పోలీసులకు వ్యతిరేకంగా నినదించినందుకే సోలిపేట రామలింగారెడ్డికి ఆదరణ దక్కిందని దుబ్బాక ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటారు. ఆయన ప్రతిసారి పోలీసుస్టేషన్‌ల ముందు ధర్నాలు చేస్తూ, పోలీసులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టడం వల్లే ప్రజాదరణను పొందారనే వాదన ఉంది. అంతేగాక ఎంతో అభివృద్ధికాముకుడిగా ఉన్న మాజీ మంత్రి ముత్యంరెడ్డి ఓటమికి కూడా కారణం పోలీసులుగానే చెప్పుకుంటారు. ఆయన కార్యకర్తల కంటే పోలీసు అధికారులకే ప్రాధాన్యతనివ్వడంతో బలమైన నాయకుడైనప్పటికీ జర్నలిస్టు రామలింగారెడ్డి చేతులో ఓటమిపాలయ్యారు. ప్రతిసారి రాజకీయ వ్యూహాలు ప్రత్యర్థుల మీద కంటే, ప్రజల మధ్య పోలీసులను లక్ష్యంగా చేసుకుని తనవ్యూహాలను కదపడం మూలంగానే రామలింగారెడ్డి ప్రజలలోకి వెళ్లగలిగారని చెబుతారు. 2019లో దుబ్బాక ఉప ఎన్నికల్లో అదే వ్యూహాలను కూడా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అవలంబించి పోలీసులను లక్ష్యంగా నిలబడి, పార్టీ ప్రచారం కంటే ఎక్కువ


మిగతా 8వ పేజీలో

నర్మెట ఆయిల్‌పామ్ కర్మాగారంలో ట్రయల్ రన్

- హర్షం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

నంగునూరు, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రూ. 300 కోట్లతో నిర్మాణం చేపడుతున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు తుది దశకు చేరుకున్నాయి. వారం రోజులుగా ఫ్యాక్టరీలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఫ్యాక్టరీలో రిఫండ్ అయిల్ తయారు అయింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన మాజీ సీఎం కేసీఆర్ హయాంలో అకురార్పణ జరిగిన ఆయిల్‌ఫాం కర్మాగారం పనులు పూర్తయి, ప్రారంభానికి చేరుకోవడం చిరస్మరణీయ ఘట్టమన్నారు. బతుకమ్మ, విజయ దశమి పండుగ వేళ అయిల్ పామ్ రైతుల్లో కొత్త వెలుగులు నిండనున్నాయని తెలిపారు. రైతుల కల సాకారం చేసేలా, చరిత్రలో నిలిచి పోయే పనులు గొప్ప సంతృప్తిని ఇస్తాయన్నారు.

ట్రయల్ రన్ సందర్భంగా బయటకు వస్తున్న ఆయిల్ →



దసరాకైనా బోనస్ అందేనా?

- 3 వేల మంది రైతులకు రూ.6.84 కోట్ల బకాయిలు
- ధాన్యం అమ్మి నాలుగు నెలలు దాటినా నేటికీ అందని వైనం



ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 19 : మరో పది రోజుల్లో దసరా పండుగ. సన్నరకం ధాన్యం అమ్మి నాలుగు నెలలు దాటినా, రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బోనస్ డబ్బు ఇంకా జమ కాలేదు. యాసంగి సీజన్‌లో పండించిన సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ హామీతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది రైతులు సన్నరకం ధాన్యాన్ని పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు. అయితే, ఇప్పటివరకు ఒక్క రైతు ఖాతాలోనూ బోనస్ డబ్బు జమ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు ఖాతాల్లో చేరినప్పటికీ, బోనస్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత వానాకాలంలో ధాన్యం విక్రయించిన రైతులకు నెల రోజుల వ్యవధిలో బోనస్ అందడంతో, ఈసారి కూడా త్వరగా వస్తాయని ఆశించారు.

రూ. 6.84 కోట్ల బకాయిలు

దిగుబడి తక్కువగా వచ్చినా, ప్రభుత్వం బోనస్ ఇస్తుందన్న నమ్మకంతోనే రైతులు సన్నరకాలు సాగుచేశారు. క్వింటాకు మద్దతు ధర రూ.2320 ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 13,682 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీనికి గానూ రైతులకు రూ. 6.84 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ సొమ్ము కోసం రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే వానాకాలం సీజన్ సగం దాటిందని, పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా నాటికైనా ప్రభుత్వం బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనుజను వివరణ కోరగా, సన్నరకం ధాన్యానికి సంబంధించిన బోనస్ నిధులు ప్రభుత్వం విడుదల చేయగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హైమావతి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- నాణ్యమైన పదార్థాలనే వాడాలి
- కలెక్టర్ హైమావతి

సిద్దిపేట రూరల్/దుబ్బాక సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి); విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే వాడాలని కలెక్టర్ హైమావతి సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేటరూరల్ మండలం ఇర్కోడులో తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, పప్పుచారు, గుడ్డు మాత్రమే వండినందుకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్ రవీందర్‌ను హెచ్చరించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. మునగ తప్పనిసరిగా పెట్టాలని చెప్పారు. కుట్టు మిషన్ నైపుణ్యం చాలా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నాన్ని వృథా చేయాలని సూచించారు. అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హాస్టల్ వార్డెన్, వంట సిబ్బందిని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులను ఆమె ఆదేశించారు. శుక్రవారం దుబ్బాక మండలం రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, ఆప్తాలిస్ట్, దంత వైద్యులు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధుల, మానసిక వైద్య నిపుణులు ద్వారా 14 రకాల ఆరోగ్య సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించాలన్నారు. ప్రతి ఒక్క మహిళ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో అక్టోబరు 2 వరకు నిర్వహించే కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుబ్బాక మండలంలో 395 మంజూరు అయ్యాయని, వాటిలో 301 ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసినట్లు అధికారులు తెలిపారు. దుబ్బాక మున్సిపల్‌లో 346 ఇళ్లు మంజూరు కాగా 224 ఇళ్లకు ముగ్గుపోసి పనులు వేగవంతం చేశామని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. లచ్చపేట వద్ద ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారివెంట తహసీల్దార్ సంజీవ్, ఎంపీవో నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు ఉన్నారు.



బతుకమ్మ, బొడ్డెమ్మ సంబురాలు

దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారం సాంప్రదాయబద్ధంగా, సందడిగా జరిగాయి. సెలవుల నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ పండుగను ముందస్తుగా నిర్వహించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ సునీత, జీవన్ కుమార్ మాట్లాడారు. వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు

\- సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 19

పూల పండుగకు వేళాయే 7



నేడు ఉమ్మడి జిల్లా

ఫుట్‌బాల్ ఎంపికలు

15 కిలోల కణితిని

తొలగించిన వైద్యులు

బిక్షాటన చేసి

నిరసన తెలిపిన వర్కర్లు

న్యాయవాదుల రక్షణ

చట్టం తీసుకురావాలి

- కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా

పై వార్తలు 7లో..

ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు

సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 11న ప్రారంభమైన ఈ పోటీలు, వర్షం కారణంగా వాయిదా పడి శుక్రవారం తిరిగి మొదలయ్యాయి. అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాలుపంచుకున్నారు. జిల్లాస్థాయి పోటీలతో పాటు, రాష్ట్రస్థాయి పోటీలకు కూడా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి క్రీడలో గెలుపు, ఓటములు సహజమని, కానీ క్రీడాస్ఫూర్తి చాలా ముఖ్యమని సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో పాటు అర్బన్ మండల విద్యాధికారి రాజప్రభాకర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సౌందర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు.





విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, అధికారులు

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్

పాపన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి గ్రామ శివారు నుంచి గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి వెళ్లి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మంజీరా నది, చెరువుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు

చేగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం కేంద్రంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీ బాలాజీ పేపర్ ప్లేట్ తయారీ పరిశ్రమలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రామయంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం జరగలేదు. శుక్రవారం తెల్లవారు జామున గురుమూర్తి కిరాణాదుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఫ్రిజ్‌లో నుంచి పొగలు రావడంతో అప్రమత్తమైన యజమాని మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు ఫ్రిజ్‌లు పూర్తిగా కాలిపోయాయి మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని యజమాని తెలిపారు.


పేపర్ ప్లేట్ పరిశ్రమంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ..

●కారు బోల్తా పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి శ్రీత

పుల్‌కల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ టైరు పగిలి ఇన్నోవా కారు బోల్తా పడిన సంఘటనలో ఓ చిన్నారి మృతి చెందగా, మరో ఆరుగురికీ గాయాలయ్యాయి. మండల కేంద్రమైన చౌటకూర్‌కు సమీపంలో అకోలా 161 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున ఈ సంఘటన జరిగింది. పుల్కల్ ఎస్సై ఎస్.విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డినగర్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తాళ్ల గౌతమ్‌గౌడ్ తన భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు, డ్రైవర్‌తో కలిసి ఈ నెల ఇన్నోవా కారులో షిర్డీ యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై చౌటకూర్ శివారులోకి రాగానే ఇన్నోవా కారు వెనుకభాగంలోని ఎడమ వైపు టైరు పగిలింది. దీంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో వాహనంలోని వారందరికీ గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారందరిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ప్రధానాసుపత్రికి తరలించారు. గౌతమ్‌గౌడ్ మూడేళ్ల కూతురు శ్రీతకు బలమైన దెబ్బలు తగలడం వల్ల మృతి చెందిందని డాక్టర్లు తెలిపారు. మిగిలిన వారందరు గాయాలతో బయటపడ్డారు. గౌతమ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్సై ఎస్.విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూల జాతరకు వేళాయే



- ● రేపటి నుంచి బతుకమ్మ పండుగ
- ● వేడుకలకు సిద్ధమైన పల్లె, పట్టణం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకు ఇచ్చేది బతుకమ్మ. కలిసి బతకమని చెప్పేది బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, జీవన విధానాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా తెలంగాణ అంతటా సందడి నెలకొంటుంది. ఖరీఫ్ పంటలు ఇంటికి చేరే సమయంలో ఈ పండుగ రావడం విశేషం. వలస వెళ్లిన వారు, పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు ఈ పండుగ కోసం తమ గ్రామాలకు తిరిగి వస్తారు. ఏడాదంతా పడ్డ కష్టాలు, బాధలు మరిచిపోయి తొమ్మిది రోజులు పండుగలో మునిగి తేలుతారు.

తొమ్మిది రోజుల పండుగ విశేషాలు

బతుకమ్మ పండుగ మహాలయ అమావాస్య (పెత్ర రామాస) రోజున ప్రారంభమై, సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఈ తొమ్మిది రోజులు ప్రతి సాయంత్రం మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని గ్రామ చావిడికి చేరుకుంటారు. అక్కడ ఒకరి పక్కన ఒకరు గుండ్రంగా తిరుగుతూ, చేతులతో లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. ఈ పాటల్లో పుట్టింటి ప్రేమలు, అత్తింటి ఆరళ్లు వంటి సామాజిక అంశాలు ప్రతిబింబిస్తాయి. తొమ్మిదో రోజున వచ్చే సద్దుల బతుకమ్మ పండుగ



అత్యంత ప్రధానమైనది. ఆ రోజు మహిళలు పోటీపడి బతుకమ్మలను పేర్చుతారు. వివిధ రకాల సద్దులను తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆటలు పాటలు పూర్తయ్యాక, బతుకమ్మలను చెరువులు, కాల్వల్లో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత చక్కెర, రొట్టెతో చేసిన మలీద అనే వంటకాన్ని బంధువులకు పంచిపెడతారు.

సిద్ధమైన ఉమ్మడి జిల్లా

తొమ్మిది రోజుల పూల పండుగకు ఉమ్మడి జిల్లా సిద్ధమైంది. ఆడపడుచులు బతుకమ్మలు పేర్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని విద్యా సంస్థల్లో ముందస్తు వేడుకలు జరుగుతున్నాయి.

బతుకమ్మ చరిత్ర, ఆచారాలు

బతుకమ్మ పండుగకు పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం, మహిషాసురుడితో పోరాడి అలసిపోయిన పార్వతీదేవి (గౌరీదేవి) మూర్ఛపోగా, ఆమెను పూలతో బతుకమని స్తుతించారని చెబుతారు. మరొక కథనం ప్రకారం, సంతానం లేని ఒక రైతు దంపతులకు ఏడుగురు పిల్లలు పుట్టి చనిపోగా, ఆఖరి బిడ్డకు బతుకమ్మ అని పేరు పెట్టడంతో ఆమె బతికిందని అంటారు.

కనుమరుగవుతున్న పూలు

గతంలో బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి, బంతిపూలతో పేర్చేవారు. అయితే వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ పూల లభ్యత తగ్గిపోయింది. ముఖ్యంగా పత్తి పంట ఎక్కువగా వేస్తుండటంతో గునుగు పూలు దొరకడం కష్టంగా మారింది. దీనితో మార్కెట్‌లో కాగితపు బతుకమ్మల అమ్మకాలు పెరిగాయి.

రోజుకో నైవేద్యం..

బతుకమ్మకు తొమ్మిదిరోజులపాటు రోజుకు ఒక ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు.

- మొదటి రోజు (ఎంగిలి పువ్వు బతుకమ్మ): నువ్వులు, బియ్యం పిండి, నూకలు.
- రెండో రోజు (అటుకుల బతుకమ్మ): సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు.
- మూడో రోజు (ముద్దపప్పు బతుకమ్మ): ముద్దపప్పు, బెల్లం, పాలు.
- నాలుగో రోజు (నానే బియ్యం బతుకమ్మ): నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం.
- ఐదో రోజు (అట్ల బతుకమ్మ): అట్లు లేదా దోశ.
- ఆరో రోజు (అలిగిన బతుకమ్మ): ఈ రోజు నైవేద్యం ఉండదు.
- ఏడో రోజు (వేపకాయల బతుకమ్మ): బియ్యం పిండిని వేయించి, వేప పండ్లలా తయారు చేసి నైవేద్యం.
- ఎనిమిదో రోజు (వెన్నముద్దల బతుకమ్మ): నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం.
- తొమ్మిదో రోజు (సద్దుల బతుకమ్మ): ఐదు రకాల సద్దులు.



సంగారెడ్డి జిల్లా కోర్టు ముందు తాడుతో చేసిన సంకెళ్లతో చేతులు బంధించుకొని ధర్నా చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

- ● కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. నాంపల్లి, నాగర్‌కర్నూల్‌లో న్యాయవాదులపై జరిగిన దాడికి నిరసనగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం వినూత్నంగా తాడుతో చేసిన సంకెళ్లతో చేతులు బంధించుకుని జిల్లా కోర్టు ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకొచ్చేవరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు మల్లేశం, శ్రీకాంత్, శ్రీనివాస్, మంజుల రెడ్డి, బుచ్చయ్య, సుభాష్ చంద్ర, నరసింహ, మాణిక్ రెడ్డి, రాములు, దత్తాత్రి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- ● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సదస్సులో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన ఆమె మాట్లాడుతూ గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. 23న నిర్వహించాల్సిన ఎంపికలను వివిధ కారణాల వల్ల నేడు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని వివరించారు. అండర్-19 బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పదవ తరగతి మెమో, బోనోఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9440686408, 9848321330 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మత్తడి పారుతున్న చేర్యాల పెద్దచెరువు





నిండుకుండలా మారిన చేర్యాల పెద్దచెరువు, పారుతున్న మత్తడి

చేర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు మత్తడి పారుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీటికి తోడు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన గోదావరి జలాలు చేరడంతో గురువారం నిండుకుండలా మారింది. శుక్రవారం ఉదయం అలుగు పారడంతో మత్స్యకారులు చేపలు పట్టారు. చాలాకాలం తరువాత మత్తడి దూకడంతో చెరువు వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది. గతంలో పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు పనులు చేపట్టినప్పటికీ అర్ధాంతరంగా నిలిచి ఏళ్లు గడుస్తున్నాయి. ప్రస్తుతం చెరువులో నీరు చేరడంతో త్వరగా సుందరీ కరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులు ఎలా కొనసాగుతున్నాయి

- ● కొండాపూర్‌లో మహారాష్ట్ర అధికారులు ఆరా



తొగర్‌పల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న మహారాష్ట్ర అధికారులు

కొండాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల తీరు, జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్వహణ, విధివిధానాలపై మహారాష్ట్ర అధికారులు ఆరా తీశారు. శుక్రవారం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా కలెక్టర్ అంజలి, 11 మంది అధికారుల బృందం తొగర్‌పల్లి గ్రామ పంచాయతీ, కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. తొగర్‌పల్లి గ్రామ పంచాయతీలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలో మొక్కల పెంపకం, చెత్త సేకరణతో ఎరువుల తయారీని పరిశీలించారు. పంచాయతీ విధి నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టంపై ప్రజలకు అవగాహన ఎలా ఉంటుందని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇంటి నిర్మాణపు పనులను పర్యవేక్షించారు. మహిళల సహాయక, యువజన సంఘాల సభ్యుల అభివృద్ధి, నిర్వహణ, ఉత్పత్తులు, విక్రయాలు, పనులతో కుటుంబాల జీవనం ఎలా మారుతుందో ఆరా తీశారు. డీఆర్డీవో బాలరాజ్, ఏపీడీ పూజ, ఎంపీడీవో వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి పనులు, స్థానిక సంస్థల విధి విధానాలు, ఉపాధిని బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, ఏపీవో వీరప్ప, పీఆర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి సౌజన్య, జీపీ కార్యదర్శులు నర్సమ్మ, సాయి, ఈసీ గణేష్, టీఏ శ్రీనివాస్, సాయిలు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీవీఆర్ఐటీలో 'ఇమాజిన్ జపాన్' పెయింటింగ్ పోటీలు



పెయింటింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నర్సాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ కాలేజీలో జపాన్ సంస్కృతిని ప్రతిబింబిస్తూ 'ఇమాజిన్ జపాన్' పెయింటింగ్ పోటీని శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను గ్రాడ్యుయేట్ స్టడీ అబ్రాడ్ సెంటర్, జపాన్ భాషా విభాగం సంయుక్తంగా నిర్వహించగా 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జపాన్ సంస్కృతి, సంప్రదాయాలు, ఆవిష్కరణలను తమ కళాత్మక సృజనాత్మకతతో కాన్వాస్‌పై చిత్రించారు. ఈ కార్యక్రమానికి సాగా యూనివర్సిటీ జపాన్ నుంచి ప్రొఫెసర్ డాక్టర్ యుకియో నాగనో, కురుమే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జపాన్ నుండి ప్రొఫెసర్ డాక్టర్ షుచిటోరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో విద్యార్థులు, అధ్యాపకులకు జపాన్ విద్యా సంబంధ అంశాలు, సంస్కృతిపై అవగాహన కల్పించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మి ప్రసాద్, డీన్ రాజు ఎడ్ల, ప్రతినిధులు ప్రణీత, లవీనా అరోరా, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్షాటన చేసి నిరసన తెలిపిన వర్కర్లు



సిద్దిపేటలో బిక్షాటన చేస్తున్న వర్కర్లు

సిద్దిపేట కల్చరల్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటింజెంట్ వర్కర్ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ నెల 12 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం సిద్దిపేట, మెదక్‌లో బిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలకు పని చేస్తున్నామన్నారు. నెలల తరబడి వేతనాలు అందక.. అప్పులు చేయలేక.. వస్తువులు ఉండలేక.. దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం చెల్లిస్తున్న వేతనాలు గతంలో రూ13,400 ఉండగా, ప్రస్తుతం రూ.10,400లకు తగ్గించి, చెల్లించడం దారుణమన్నారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన వర్కర్ల స్థానంలో బాధిత కుటుంబంలో ఒకరికి పని కల్పించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరవధిక సమ్మెలో జిల్లా నాయకులు రమేష్, లక్ష్మి, సురేష్, స్వామి, కనకయ్య, పరశురాములు, మెదక్ వర్కర్స్ యూనియన్ సభ్యులు రాంచందర్, మాధవి, సునంద, శేఖర్, సువర్ణ, జ్యోతి, పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇక.. నేనెట్ల బతకాలే..!

- ఓ వృద్ధురాలి ఆందోళన
- భర్త పేరిట ఉన్న భూమి కుమారులకు..
- ఇద్దరూ చనిపోవడంతో వారి భార్యలకు..

మనోహరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఇద్దరు కుమారులు.. ఓ కుమార్తె వేర్వేరు సమయాల్లో ఇద్దరూ చనిపోయారు. అంతకు ముందే భర్త చనిపోవడంతో ఉన్న ఆస్తిని కుమారుల పేరిట మార్చింది. ఏ ఆసరా లేకపోవడంతో కుమార్తె దగ్గర ఉంటోంది. పెద్ద కుమారుడి భార్య తన భర్త పేరిట ఉన్న భూమిని అనుభవిస్తోంది. రెండో కుమారుడి పేరిట ఉన్న భూమి తనకే దక్కాలంటూ అతని భార్య తహసీల్దార్‌ను ఆశ్రయించగా, ఆయన గురువారం ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అయితే, ఉన్న భూమి తీసుకుంటే తానేం కావాలని.. తనను ఎవరు చూసుకుంటారని తల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగింది. ఇద్దరు కుమారులు చనిపోవడం.. ఉన్న భూమి ఇద్దరు కోడళ్లు తీసుకోవడంతో ఆ వృద్ధురాలు ఇక తనను ఎవరు చూసుకుంటారంటూ ఆందోళనకు దిగింది.

తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన గంగా మాధవికి భర్త రాములు గతంలోనే మృతి చెందాడు. వీరికి మనోహరబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో 33 గుంటల భూమి ఉంది. దీంతో భర్త రాములు పేరు మీద ఉన్న భూమిని ఇద్దరు కుమారుల పేరిట మార్చింది. పెద్ద కుమారుడు కుమార్ పెళ్లి అయిన ఆరు నెలలకు కరోనా సయమంలో మృతి చెందాడు. అతని భార్య



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వృద్ధురాలు

పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. చిన్న కుమారుడు గౌరి శంకర్‌కు 2022లో పెళ్లి కాగా, 2024లో గోడకూలి చనిపోయాడు. దీంతో అతని భార్య కూడా తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. ఏకాకి అయిన తల్లి తన కుమార్తె వద్ద హుస్నాబాద్‌లో ఉంటోంది. చిన్న కుమారుడి పేరిట ఉన్న భూమి తన పేరిట చేయాలని చిన్న కోడలు ఏడాదిగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. ఈ క్రమంలో తహసీల్దార్ ఇద్దరినీ పిలిచి మాట్లాడారు. అయినా, వారు ఒక ఒప్పందానికి రాలేదు. తాజాగా మరో మారు గంగా మాధవికి నోటీసు పంపినా, ఆమె రాలేదు. భర్త పేరిట ఉన్న భూమి చట్ట ప్రకారం భార్యకు దక్కుతుందని గురువారం తహసీల్దార్ కోడలు సునిత పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో గంగా మాధవి శుక్రవారం కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళనకు దిగింది. తనకు ఎవరూ లేరని, ఏ ఆధారం లేని తనను ఇక ఎవరు చూస్తారని ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు వచ్చి ఆమెకు నచ్చజెప్పి పంపించారు. ఈ విషయంలో తహసీల్దార్ ఆంజనేయులును సంప్రదించగా, ఈ భూమి విషయంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చామని, వారు ఓ ఒప్పందానికి రాకపోవడంతో చట్ట ప్రకారం భర్త పేరిట ఉన్న భూమిని భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అహ్మదీపూర్ విద్యార్థిని



గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం డిల్లీ పబ్లిక్ స్కూల్ పటాన్‌చెరులో జరిగిన జోనల్ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మాధవి, 9వ తరగతి అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్ తెలిపారు.



వైద్యులు తొలగించిన 15 కిలోల కణితి

15 కిలోల కణితిని తొలగించిన వైద్యులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ శివారులోని మహేశ్వర మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో శుక్రవారం వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్‌కు చెందిన ముంతాజ్(55) 3 సంవత్సరాలుగా కడుపునొప్పి, పొట్ట పెరగటం వంటి సమస్యలతో బాధపడుతున్నది. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ఆమె చివరకు మహేశ్వర ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. వారు ఆమెకు పరీక్షలు నిర్వహించి అండాశయంలో 15 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. యాజమాన్యం ముంతాజ్ విషయంలో తమవంతు సామాజిక బాధ్యతగా అతి తక్కువ ఖర్చులోనే వైద్యాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. ముంతాజ్ వయసు, ఆరోగ్యం దృష్ట్యా శస్త్రచికిత్స ప్రమాదకరం అయినప్పటికీ రిస్క్ తీసుకుని లాపరోటమీ ద్వారా తన అండాశయంలోని కణితిని తొలగించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆడమ్ తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్లు శ్రీనివాస్, హేమంత్, భావనారెడ్డి, అంకాలజీ విభాగం వైద్యుడు శంకర్‌రెడ్డి, సర్జరీ విభాగం డాక్టర్ సూర్యతేజ, స్త్రీల వైద్య విభాగం డాక్టర్ అరుణ, అపర్ణ, సుప్రియ, డాక్టర్ శివలత, ఆకాంక్ష తదితర నిపుణులు పాల్గొన్నారు.

ఇట్లయితే వ్యవసాయం ఎలా చేసుకోవాలి?

- ● వరదనీటిలో పరిశ్రమల రసాయన జలాల పారబోతతో పంటలు నాశనం
- ● సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ● అధికారులకు దోమడుగు గ్రామస్థుల మొర



నల్లకుంట చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశం, వివిధ పార్టీ నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): " వర్షం పడిందంటే పంట పొలాలు పచ్చగా మారాలి.. కానీ మా గ్రామంలో ఎర్రగా మారుతున్నాయి.. పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా వెలువడుతున్న రసాయన జలాలు వరదతో పాటు వచ్చి చెరువుల్లోకి, మా పొలాల్లోకి చేరుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పంటలు పండించాలి? ఎలా జీవించాలి?.." అంటూ మండలంలోని దోమడుగు గ్రామస్థులు అధికారులతో తమ గోడును వెల్లబోసుకున్నారు. వర్షాలతో దోమడుగులోని నల్లకుంట చెరువు పరిశ్రమల రసాయన జలాలతో నిండిపోయింది. ఫలితంగా చుట్టుపక్కల పొలాలకు ఆ జలాలు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతింటున్నాయి, భూమి నాణ్యత తగ్గిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశం, వివిధ రాజకీయ పార్టీ నాయకులు నల్లకుంట చెరువును సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కాలుష్య జలాలతో పంట పొలాలను నాశనమవుతున్నాయన్నారు. తాత్కాలిక చర్యలు కాకుండా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేయడం అసాధ్యం మొరపెట్టుకున్నారు. స్పందించిన అధికారులు సమస్యను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గతంలో కూడా ఇలాంటి హామీలిచ్చి విస్మరించారని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల జీవనాధారమైన పంటల సాగుకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల కాలుష్య జలాలను నిరోధించే శాశ్వత పద్ధతులు అమలు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, గ్రామస్థులు పలువురు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన భారీ వృక్షం



మాచాపూర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని మాచాపూర్‌లో ఓ భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వర్షానికి కూలిన ఇళ్లు

మిరుదొడ్డి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో శుక్రవారం రెండు ఇండ్లు కూలాయి. గ్రామానికి చెందిన వడ్లూరీ రత్నారెడ్డి, దుర్గారెడ్డిల ఇండ్లు వర్షానికి కూలాయి. దీంతో పెనుప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసుకోవాలని బాధితులు కోరారు.

న్యూస్ బాక్స్

రేపు మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వెచరేణి షరీఫ్ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామని సంస్థ బాధ్యులు ఖాశీఫ్ పాషా తెలిపారు. ఈ నెల 21న సిద్దిపేటలోని మదీనా ఫంక్షన్ హాల్‌లో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7702134438, 6281744387 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మండపాలకు అనుమతి తీసుకోవాలి

కోహెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న దుర్గామాత మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అభిలాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పోలీస్ పోర్టల్‌లో కమిటీల వివరాల నమోదు చేసి ఒక కాపీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు (సెమినార్) బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అక్టోబర్ 24, 25 తేదీల్లో సైబర్ సెక్యూరిటీ ఛాలెంజెస్ అండ్ ప్రాస్పెక్టివ్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత ఆవిష్కరించారు.

బీజేపీ సీనియర్ నాయకుడు మృతి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బండారి భిక్షపతి గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. గజ్వేల్ బీజేపీ నాయకులు చందాలు వేసుకొని అంత్యక్రియలు చేశారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామం దమ్మ చెరువులో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సోమారపు రాజయ్యకు చెందిన గేదెకు నీరు తాగించేందుకు చెరువులోకి తోలాడు. ఈ క్రమంలో అక్కడ తెగిపోయిన ఎల్‌టీ లైన్‌కు తగిలిన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్, పశు సంవర్ధక శాఖల అధికారులు సందర్శించి పంచానామా నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

కుకునూరుపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి నుంచి బొబ్బాయిపల్లి వరకు గతంలో రోడ్డు మంజూరు కాగా శుక్రవారం రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


ప్రధాన రహదారి.. పట్టించుకునేవారేరి?

- ప్రమాదకరంగా చేర్యాల-కడవేరుగు దారి
- చినుకుపడితే చిత్తడిమయం
- కోతకు గురైన సైడ్‌బర్మ్‌లతో ప్రమాదాలు
- చేర్యాల పట్టణ శివారులో దెబ్బతిన్న రోడ్డు
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం




కడవేరుగు దారిపై చేర్యాల శివారులో గుంతల్లో నిలిచిన నీటితో చిత్తడిమయం, చేర్యాల కడవేరుగు దారి ఇలా..

చేర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసలే సింగిల్ రోడ్డు.. ఆపై గుంతలు.. అదీ చాలదన్నట్టుగా ఇటీవల వర్షాలకు కోతకు గురైన సైడ్‌బర్మ్‌లు వెరసి చేర్యాల-కడవేరుగు ప్రధాన రోడ్డు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. పట్టణ శివారులోని గాంధీచౌక్ నుంచి కడవేరుగు గ్రామం వరకు గల బీటీ రోడ్డు కొన్నాళ్ల క్రితం దెబ్బతిని పలు ప్రదేశాల్లో గుంతలు ఏర్పడ్డాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదనీటి ప్రవాహంతో సైడ్ బర్మ్‌లు కోతకు గురయ్యాయి. సింగిల్‌రోడ్డు కావడంతో ఓ వాహనం వస్తే మరో వాహనాన్ని పక్కకు నిలుపుకోలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.



అడుగున్నరలోతు కోతకు గురైన సైడ్ బర్మ్

మరమ్మతులను పట్టించుకోరా?

నిత్యం చేర్యాల పట్టణం నుంచి కడవేరుగు దారి గుండా నాగపురి మీదుగా అతితక్కువ దూరంలో హైదరాబాద్, యాదాద్రి తదితర జిల్లాలకు వాహనాలపై రాకపోకలు సాగిస్తారు. ఎన్నో యేళ్లక్రితం నిర్మించిన సింగిల్ రోడ్డు కావడంతో ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నది. పలు ప్రదేశాల్లో గుంతలు ఏర్పడి కోతకు గురవుతున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఈదారి వెంబడి ప్రయాణించాలంటేనే జంకుతున్నారు.

గుంతలతో చిత్తడిమయం

గాంధీచౌక్, దుర్గమ్మ ఆలయం, బాలికల జడ్పీఎస్ఎస్, ఊట్లపల్లి కాలనీకివెళ్లే చౌరస్తాతో పలు ప్రదేశాలలో రోడ్డు దెబ్బతిని భారీగా గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా గుంతలలో నీరు నిల్వ ఉండి వాహనాల రాకపోకలతో చిత్తడిమయమవుతుంది. దీంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా సుమారు అడుగున్నరలోతు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాయకుల తీరుపై విస్మయం

ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుపై ఎలాంటి ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుపక్కన సైడ్‌బర్మ్‌లలో మట్టితో సరిచేసి, గుంతలను పూడ్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా హ్యామ్ పద్ధతిలో చేర్యాల-నాగపురి రోడ్డు విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు తమ అధినేతల కృషితోనే సాకారం కాబోతుందని పేర్కొంటూ పోటాపోటీగా క్షీరాభిషేకాలు చేసినప్పటికీ గుంతలతో పాటు రోడ్డు దుస్థితిపై స్పందించకపోవడం పట్ల స్థానికులు, ప్రయాణికులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

పనులను వేగవంతం చేయాలి



గట్ల మల్లెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న గరీమా అగ్రవాల్

నంగునూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గట్ల మల్యాల గ్రామంలో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ ఇంజనీర్‌ను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం పూర్తయినప్పటికీ ప్రహరీ, సీసీ రోడ్డు, వాటర్ సప్లయి, ఫర్నిచర్‌తో పాటు కనీస వసతులు కల్పించాలని ఆమె సూచించారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయకపోతే టెండర్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ అంజలి రెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వేణుగోపాల్, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా గట్ల మల్యాల పంచాయతీ కార్యదర్శి లలిత అవినీతికి పాల్పడుతూ గ్రామ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు ఫిర్యాదు చేశారు. ఏడాది కాలంగా గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో కార్యదర్శి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి పన్ను రసీదుపై తప్పుగా నమోదైన పేరును సరిచేసేందుకు రూ.5వేలు డిమాండ్ చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి తన ఇంటి నిర్మాణం పర్మిషన్ కోసం పంచాయతీ కార్యదర్శి దగ్గరికి వెళ్లగా రసీదు ఇచ్చినా ఇంటి అనుమతి పత్రాలు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు.

- **చేర్యాల:** పట్టణ శివారు బీడీకాలనీ సమీపంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాన్ని శుక్రవారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పరిశీలించారు. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి వరకు వచ్చే మట్టిరోడ్డును సీసీ నిర్మాణానికి ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ నాగేందర్‌కు సూచించారు త్వరితగతిన సేవలు అందు బాటులోకి తీసుకురావడానికి గల అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

మునిసిపల్ కార్యాలయం ఎదుట వ్యక్తి హల్‌చల్

గజ్వేల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయం ఎదుట ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హఫీజ్ అనే వ్యక్తి ఇల్లు కట్టుకుంటుండగా మునిసిపల్ అధికారులు తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంటి నిర్మాణాన్ని తొలగించారు. దీంతో ఆగ్రహానికి గురైన హఫీజ్ మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు అక్కడకు చేరుకుని హఫీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ సంస్కృతిని పరిరక్షించుకుందాం

- పలుచోట్ల ముందస్తు బతుకమ్మ సంబురాలు

గజ్వేల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని పరిరక్షించుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి అయిన బతుకమ్మ పండుగను మనమంతా పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. కళాశాల మహిళా సాధికారత విభాగం, తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బతుకమ్మలను అందంగా పేర్చి ఆట, పాటలతో విద్యార్థినులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించుకున్నారు.

ధర్మవీర్ యోగా శిక్షణ కేంద్రంలో..

హుస్నాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్ ధర్మవీర్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. డీజే పాటలు కాకుండా సాంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ధర్మవీర్ యోగా ఇన్‌స్ట్రక్టర్ అయిలేని అనిత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంఇఓ మనీల, మాజీ కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కొంకటి నళినిదేవి, వాల సుప్రజ, బోజు రమాదేవి తదితరులున్నారు.



హుస్నాబాద్‌లో బతుకమ్మను పేర్చుతున్న మహిళలు

విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

- కళాశాలల్లో అలరించిన ఫ్రెషర్స్ డే

దౌల్తాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీ వాత్సవ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల, ఆట పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కాగా గత సంవత్సర వార్షిక పరీక్షల్లో తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు తెలుగు అధ్యాపకుడు రాజు ఒక్కొక్కరికి రూ.1,116 చొప్పున బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు శుక్రవారం స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ వి లలిత, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, హెచ్‌ఎంలు వాసుదేవరెడ్డి, వెంకటయ్య, తదితరులున్నారు.



హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన దాదాపు 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి కె వెన్నెల, రెండవ బహుమతి బి రిషికా, మూడవ బహుమతి జి నేత్ర గెల్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, ఉపాధ్యక్షురాలు కాదాసు దీపికా, లకావత్ శారద, గాదాసు రాంప్రసాద్, సాయిరామ్, నరేష్ తోట సమ్మయ్య, అనంతస్వామి తదితరులున్నారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

ములుగు: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమారెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు మండలం తునికిబొల్లారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే అభివృద్ధి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

ములుగు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజుల పాటు 18, 19 తేదీల్లో జరుగుతున్న ఉపాధ్యాయరంగంపై పర్యావరణ మార్పులు అనే జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపకులపతి దండ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

కుకునూరుపల్లి/హుస్నాబాద్/మర్కుక్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ క్రీడల్లో కుకునూరుపల్లి విద్యార్థులు సత్తా చాటారు. సిద్దిపేట పట్టణంలో జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు నిర్వహించగా కుకునూరుపల్లి అండర్ -14 బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించగా, హుస్నాబాద్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. అదే విధంగా బుధవారం కుకునూరుపల్లి జిల్లా విద్యార్థులు వాలీబాల్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. అదేవిధంగా జిల్లా స్థాయి అండర్- 17 బాలుర కబడ్డీ పోటీల్లో దుబ్బాకతో పోటీ పడి హుస్నాబాద్ జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి అండర్ 17 బాలికల విభాగంలో మర్కుక్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు ద్వితీయస్థానం సాధించారు. కాగా విజేతలను ఆయా మండల ఎంఈవోలు, పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

పండగకైనా జీతాలు ఇవ్వరా?

కుకునూరుపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పండగకైనా జీతాలు ఇవ్వరా అని గ్రామ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సీఐటీయూ మండల అధ్యక్షుడు భోగి సాయికుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే బతుకమ్మ దసరా, దీపావళి పండుగలకు కూడా పస్తులు ఉండాలా అని ప్రశ్నించారు. తమకు 3 నెలల నుంచి జీతాలు రావడంలేదని వెంటనే ప్రభుత్వం వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్, నరహరి, సుధాకర్, లక్ష్మణ్, బిక్షపతి, లక్ష్మి, పోశయ్య, రాజమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

మిరుదొడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో సరస్వతీ దేవతా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజు, నాయకులు ఉన్నారు.

సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ తనిఖీ

చేర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని సర్కిల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని హుస్నాబాద్ ఏసీపీ సదానందం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయ రికార్డులు, పార్ట్ 2 మ్యాప్, మూడేళ్ల నేరాల పట్టికను పరిశీలించి ఆరా తీశారు. అనంతరం సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్, మహబూబ్‌లతో సమావేశమై పలు సూచనలు చేశారు. అంతకు ముందు పట్టణంలోని గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించారు. క్రమశిక్షణ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, పోలీస్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

పోషణ మాసోత్సవ ప్రతిజ్ఞ

చేర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ మాసోత్సవంలో భాగంగా చేర్యాల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-6లో శుక్రవారం పోషణ ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార విలువలను గర్భిణులు, బాలింతలకు వివరించిన అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ డి.శోభ, ఆయా బాలలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల వద్దనే విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్

దౌల్తాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ కోసం పాఠశాల వద్దనే ఆధార్ అప్‌డేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఎంఈవో గజ్జల కనకరాజు అన్నారు. దౌల్తాబాద్ మండల వనరుల(ఎమ్మార్సీ) కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆధార్ బయోమెట్రిక్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో గజ్జల కనకరాజు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి ఆధార్ బయోమెట్రిక్ తప్పకుండా చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆధార్ లో ఏమైనా పొరపాటు ఉంటే సంబంధిత విద్యార్థుల పుట్టినరోజు సర్టిఫికెట్ ద్వారా మార్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శేఖర్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు

నవంబర్ 14లోగా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం

హుస్నాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 14 వరకు హుస్నాబాద్ గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం బాత్‌రూమ్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. నవంబర్ 14న గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భవనాన్ని ప్రారంభించేలా పనులను వేగవంతం చేయిస్తున్నామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అందరూ ఉత్తమ ఉపాధ్యాయులేనని ఎంఈవో బచ్చలి సత్తయ్య తెలిపారు. శుక్రవారం కుకునూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వినూత్నంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం నిర్వహించారు. మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారితో పాటు పాఠశాలలో పనిచేస్తున్న అందరినీ ఘనంగా సన్మానించారు. మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులకు శాలువాతో, పూలదండలతో, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను తినిపించారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన మల్లం ఐలయ్య, నరేందర్‌కు ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



సిబ్బందితో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమం లో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విరివిరిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తే అవి మనకు స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని, ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామచందర్, హెచ్‌వోడీలు పద్మావతి, శ్రీనివాస్, ఎల్ఎన్ రావు, పోచయ్య, మల్లేశం, పీఆర్‌వో రఘు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి ఫలితమే జిల్లాకు ఉత్తమ స్థానం



ఉద్యోగ విరమణ పొందుతున్న ఎంఈవో మాధవరెడ్డిని సన్మానిస్తున్న డీఈవో

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అందరూ కలిసి కట్టుగా పని చేయడం వల్లే సిద్దిపేట జిల్లాను రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ స్థానంలో ఉంచినట్టు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎంఈవో మాధవరెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మాధవరెడ్డి మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో ఎన్నో సేవలు చేశాడని గుర్తు చేశారు. తిగుల్, గొల్లపల్లి, జగదేవ్‌పూర్ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, ఎంపీడీవో రాంరెడ్డి, ఎస్ఐ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం ఉన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

కోహెడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనిగరం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వేణుగోపాల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. శుక్రవారం తోటి ఉపాధ్యాయులు ఆయనకు పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళ మాట్లాడుతూ వేణుగోపాల్ విద్యార్థులకు చాలా చక్కగా సులభంగా అర్థమయ్యే రీతిలో గణితం బోధిస్తూ, అంకితభావంతో పనిచేసారనీ సేవలను కొనియాడారు. జిల్లాలోని చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ ఉన్నత పాఠశాలకు పీజీహెచ్‌ఎంగా బదిలీ అయి బాధ్యతలు చేపట్టారు.

దుబ్బాక రాజ'ఖాకీ'యం!

(5వ పేజీ తరువాయి)

సమయం పోలీసుస్టేషన్ల ముందు కూర్చోవడం మూలంగా ప్రజల్లో చర్చ ఏర్పడిందని చెబుతుంటారు.

మాజీ ఉన్నతాధికారి అండదండలతోనే..?

వీరిద్దరు అకస్మాత్తుగా దుబ్బాక ప్రాంతంలో సేవాకార్యక్రమాలు చేపట్టడంపై పలురకాలుగా ప్రచారం సాగుతుంది. ఒక కీలకమైన పార్టీలో పని చేస్తున్న మాజీ పోలీస్ అధికారి అండదండలతోనే వీరు దుబ్బాకలో సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఆ ఉన్నతాధికారి చేపట్టిన సామాజిక సేవా సంస్థలో ఓ అధికారి పాలుపంచుకున్నారు. అలాగే యథావిధిగా జనరల్ స్థానంగా కొనసాగితే డీసీపీ మధుకర్‌స్వామికి అవకాశం ఉంటుందనే హామీతో వీరు దుబ్బాక నియోజక వర్గంపై దృష్టిపెట్టి, సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రచారం సాగుతుంది. ఇప్పటి వరకు పలు కార్యక్రమాలు చేపడుతున్న వీరిద్దరు ఆదివారం యువత రాజకీయ చైతన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న పలు సంఘాలతో మమేకమై పలు కార్యక్రమాలు చేపట్టి ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

దుబ్బాక రిజర్వేషన్‌పై ఉత్కంఠ..

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో దుబ్బాక రిజర్వేషన్ తప్పకుండా మారుతుందనే సంకేతాలు ఇప్పటికే వచ్చాయి. ఇక్కడ ప్రధానంగా ఎస్సీ సామాజిక వర్గం జనాభా ఎక్కువగా ఉండడంతో ఆ కోటాలో రిజర్వేషన్ రావొచ్చని పలువురు ఆశిస్తున్నారు. అందుకే ఎస్సీ వర్గానికి చెందిన వారు దుబ్బాకపై కన్నేశారు. ఇక మహిళల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నందున మహిళా నేతలు సైతం దుబ్బాకను మహిళలకు కేటాయించవచ్చనే ప్రచారం జరుగుతోంది. జనరల్ స్థానంగా కొనసాగితే ప్రస్తుత ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మళ్లీ పోటీ చేయకపోవచ్చని, ఆయన ఎంపీగా వెళ్తారనే చర్చ లేకపోలేదు. మాజీ ఎమ్మెల్యే, తాజా ఎంపీ రఘునందన్‌రావు సైతం మరోసారి ఎంపీగా లేదంటే ఇతర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ ఆశావహులు మాత్రం ఇప్పటి నుంచే తమదైన ముద్ర వేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు.